క్లుప్తంగా

డివైడర్‌ను ఢీకొన్న బైకు.. ఇద్దరికి గాయాలు

ఉలవపాడు: ద్విచక్ర వాహనంపై అద్దంకి నుంచి నాయుడుపేట వెళ్తుండగా డివైడర్‌ను ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన జాతీయ రహదారిపై చాగల్లు వద్ద శుక్రవారం జరిగింది. వివరాలు.. అద్దంకికి చెందిన మస్తాన్, కొండపికి చెందిన పెంచలయ్యలు ద్విచక్ర వాహనంపై నాయుడుపేట వెళ్తున్నారు. చాగల్లు వద్దకు రాగానే వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఇద్దరికీ గాయాలయ్యాయి. క్షతగాత్రులను హైవే అంబులెన్స్ సిబ్బంది కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కందుకూరు అర్బన్: ప్రతి ఒక్కరూ విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కందుకూరు మోటార్ వాహనాల తనిఖీ అధికారి షేక్ మహ్మద్ రఫీ స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక శ్రీ గాయత్రి డిగ్రీ కళాశాలలో 34వ జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా విద్యా సంస్థల యాజమాన్యాల బస్సు డ్రైవర్లకు, సూపర్‌వైజర్లకు, హెల్పర్స్‌కు రోడ్డ భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహ్మద్ రఫీ మాట్లాడుతూ స్కూల్స్‌కు సంబంధించిన ధ్రువపత్రాలతో పాటు స్కూల్ బస్సులు నడిపే డ్రైవర్స్ డ్రైవింగ్ లైసెన్స్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. బస్సుల్లో అధిక సంఖ్యలో విద్యార్థులను తీసుకెళ్లరాదని సూచించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. గాయత్రి కళాశాల చైర్మన్ రామకృష్ణ, భరద్వాజ్ పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ప్రెసిడెంట్‌గా రామకృష్ణ



నియామక పత్రం అందుకుంటున్న చక్కా రామకృష్ణ

హనుమంతునిపాడు: వాసవీ క్లబ్ మండల శాఖ ప్రెసిడెంట్‌గా వేములపాడు గ్రామానికి చెందిన చక్కా రామకృష్ణను క్లబ్ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించి శుక్రవారం ఎన్నుకున్నారు. సెక్రటరీగా చక్కా కేశవరావు, ట్రెజరర్‌గా దొడ్ల శ్రీనివాసలుశెట్టిలను ఎన్నుకున్నారు. నూతన క్లబ్ సభ్యులు వాసవీ క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

85 మందికి కంటి పరీక్షలు



వైద్య సేవలు వినియోగించుకోవాలని ప్రజలకు వివరిస్తున్న సర్పంచ్ విజయలక్ష్మి

సింగరాయకొండ: మండలంలోని బింగినపల్లి గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ జెట్టి విజయలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి సహకారంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 85 మందికి డాక్టర్ సుదీర్ వైద్య పరీక్షలు చేశారు. నేత్ర సమస్యలు ఉన్నవారిని పలుకూరు పంచాయతీ పంటవారి పాలెం వద్ద ఉన్న ఆస్పత్రికి రావాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు జెట్టి శంకరరెడ్డి, ఎల్‌వి ప్రసాద్ ఆస్పత్రి సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి



కూలీలతో మాట్లాడుతున్న డ్వామా ఏపీడీ సుజాత

వెలిగండ్ల: ఉపాధి పనుల్లో రోజువారీ కూలీల సంఖ్యను క్రమేణా పెంచాలని డ్వామా ఏపీడీ సుజాత అన్నారు. మండలంలోని గోకులం పంచాయతీ జిళ్లెళ్లపాడులో జరుగుతున్న ఉపాధి పనులను ఆమె శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ ఉపాధి పనుల్లో ప్రగతి చూపించాలన్నారు. రోజూ 2,500 మంది పనికి వచ్చే విధంగా ఫీల్డ్ అసిస్టెంట్లకు టార్గెట్లు ఇవ్వాలన్నారు. ఏపీఓ నాగరాజు, ఈసీ సత్యనారాయణ, టీఏ మనోహర్, మణి, రూప్‌కుమార్, నారాయణమ్మ, ఆదినారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సంక్షేమానికి రారాజు వైఎస్ జగన్

● ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి



మహిళ సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి

వలేటివారిపాలెం: సంక్షేమానికి రారాజు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి..అని కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పోకూరులో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారని పేర్కొన్నారు. లబ్ధిదారులకు అందే సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఆ పథకాలు అందాయా లేదా, ఇంకేమైన పథకాలకు అర్హత ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రేషన్ బియ్యం బండి ఇంటికి వచ్చి సరుకులు ఇస్తుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వలంటీర్లు పింఛన్ ఏ సమయానికి ఇస్తున్నారని ఆరా తీశారు. పోకూరు ఎస్సీ కాలనీకి చెందిన కొనేటి అంకమ్మ తనకు జాబ్‌కార్డు లేదని, ఇప్పించి పని కల్పించాలని ఎమ్మెల్యేను కోరగా ఆయన స్పందించి ఏపీఓను పిలిచి ఆమెకు జాబ్‌కార్డు అందజేయాలని ఆదేశించారు. అదే కాలనీకి చెందిన లింగాబత్తిన మాలకొండయ్య తమ బజారుకు కరెంట్ స్తంభాలు, సైడ్ కాలువలు లేవని తెలిపారు. అదే కాలనీకి చెందిన ఆనందరావు తమ ఇంటికి కరెంట బిల్లు అధికంగా వస్తోందని, దీని కారణంగా వాహన మిత్ర ఆగిపోయిందని ఎమ్మెల్యే ముందు వాపోయారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మీరు చెప్పిన సమస్యలు వారంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గతంలో గడప గడపకు కార్యాక్రమానికి వచ్చిన సమస్యలను పది రోజుల్లో పరిష్కరించామని ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి గుర్తు చేశారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా పోకూరు సచివాలయానికి రూ.20 లక్షలు ప్రభుత్వం మంజురు చేసిందని, మరో రూ.10 లక్షలు మంజురు చేయిస్తామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఎంపీడీఓ షేక్ రఫీక్ అహ్మద్, తహసీల్దార్ సుందరమ్మ, ఏపీఓ షమీర్ బాషా, ఏఓ హేమంత్ భరత్‌కుమార్, పంచాయతీరాజ్ ఏఈ గోపీచంద్‌రెడ్డి, ఎలక్ట్రికల్ ఏఈ మధుబాబు, ఏపీఎం శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీటీసీ భారతి, ఎంపీపీ మౌనిక, ఉప సర్పంచ్ ఉన్నం శరత్, ఎంపీటీసీలు విజయలక్ష్మి, రవీంద్ర, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు రామయ్య, వడ్లమూడి సుబ్బరావు, పర్రె జగదీష్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు రైతన్నలకు వరం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

పామూరు: ధాన్యం కొనుగోలు కేంద్రాలు రైతన్నలకు వరంలాంటివని, దళారీ వ్యవస్థకు చెరమగీతం పాడి రైతన్నలకు మేలు చేకూర్చేందుకే ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిందని ఎంపీపీ గంగసాని లక్ష్మి, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య అన్నారు. మండలంలోని మోపాడు రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం పామూరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో చైర్మన్ పువ్వాడి వెంకట సుజాత అధ్యక్షతన ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించి వ్యవసాయాన్ని పండగ చేస్తోందన్నారు. ముఖ్యంగా ఆర్బీకేల్లో కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు పండించిన పంటలను కొనుగోలు చేసి అన్నదాతలకు అండగా నిలుస్తోందన్నారు. ధాన్యం క్వింటా మద్దతు ధర ఏ–గ్రేడ్ రూ.2,060, కామన్ రకం క్వింటా రూ.2,040గా నిర్దేశించినట్లు తెలిపారు. పీఏసీఎస్ కార్యదర్శి ఎన్.శేషిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి, సర్పంచ్ చప్పిడి వరలక్ష్మి, కో ఆప్షన్ సభ్యుడు షేక్ నాయబ్ రసూల్, పీఏసీఎస్ డైరెక్టర్ చెనికల శ్రీను, చప్పిడి రామయ్య, ఖాదర్‌బాషా, గట్లా, విజయభాస్కర్ రెడ్డి, జి.వెంకటేశ్వరరెడ్డి, ఎం.రామసుబ్బారెడ్డి, జే.గోవిందయ్య పాల్గొన్నారు.

ఒంగోలు జాతి ఆవుల పరిరక్షణకు కృషి



పశుపోషకులకు మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ కాలేషా

సీఎస్‌పురం: ఒంగోలు జాతి ఆవుల పరిరక్షణకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ఒంగోలు డీఎల్‌డీఏ కార్యనిర్వహణాధికారి డాక్టర్ ఎస్‌కే కాలేషా అన్నారు. బయోడైవర్సిటీ బోర్డ్, పశు సంవర్ధకశాఖ, పశు గణాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో మండలంలోని బోయమడుగుల పంచాయతీ వెంకటాయచెరువులో శుక్రవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన ఆయన మాట్లాడుతూ వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేయడం ద్వారా ఒంగోలు జాతి ఆవుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు జిల్లాలో ఆరు చోట్ల పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. వెంకటాయచెరువులోని ఆవులకు పరీక్షలు నిర్వహించి రూ.20 వేల విలువ చేసే మందులు పశుపోషకులకు అందజేశారు. స్థానిక పశువైద్యశాల ఏడీ ఆర్.రమేష్, పశువైద్యాధికారి ఎస్‌కే మునీర్, డీఎల్‌డీఏ పశువైద్యులు కృపారావు, రైతు భరోసా కేంద్రం ఏహెచ్‌ఏ హరీష్ పాల్గొన్నారు.

25 నుంచి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం



గ్రానైట్‌తో తయారు చేయించిన విగ్రహం

సీఎస్‌పురం: ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఈ నెల 25 నుంచి స్వామి వారి విగ్రహ ప్రతిష్ట మంహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి, ముడుమాల నారాయణరెడ్డిలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో గతంలో ఉన్న స్వామి వారి విగ్రహం స్థానంలో నూతనంగా స్వామి వారి రాతి విగ్రహం ఏర్పాటు చేయాలని సంకల్పించారు. దాతలు చందాలు వేసుకుని దాదాపు రూ.15 లక్షల ఖర్చుతో మహాబలిపురంలో గ్రానైట్ రాయితో స్వామి వారి విగ్రహాన్ని తయారు చేయించారు. ఈ విగ్రహాన్ని ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న సందర్భంగా ఈ నెల 25 నుంచి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 25న గణపతి పూజ, పుణ్యాహ వచనం, గోపూజ, రక్షా బంధనం, ప్రధాన కలశ సహిత నవగ్రహ పూజ, గణపతి హోమం, 26న నారాయణస్వామి విగ్రహానికి జలాధివాసం, క్షీరాధివాసం, అభిషేకాలు, మూలమంత్ర హోమాలు, రాత్రికి ధాన్యాధివాసం, పుష్పా ధివాసం, మంత్ర పుష్పం, 27న శుక్రవారం గణపతి పూజ, గర్తన్యాసం, నవరత్న స్థాపన, పంచలోహ స్థాపన, స్వామి వారి విగ్రహ ప్రతిష్ట, పూర్ణాహుతి, కలశాభిషేకం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు.

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



విన్నర్ టీమ్ కెప్టెన్‌కు కప్ అందజేస్తున్న హుసేన్‌రెడ్డి

పామూరు: యువత విద్యతో పాటు క్రీడల్లోనూ సత్తాచాటాలని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి అన్నారు. సంక్రాంతి సందర్భంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మండలంలోని మార్కొండాపురంలో 8 రోజులుగా జరుగుతున్న నియోజకవర్గస్థాయి క్రికెట్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా కోదండరామస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన బహుమతి ప్రదాన కార్యక్రమంలో టోర్నీ విజేతగా నిలిచిన మార్కొండాపురం జట్టుకు ప్రథమ బహుమతి రూ.20 వేలు, రన్నర్ జట్టుగా నిలిచిన భూమిరెడ్డి పల్లె జట్టుకు రూ.15 వేలు, ట్రోఫీని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి హుసేన్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పుట్లూరి నారాయణరెడ్డి, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, ఖాదర్‌బాషా, కోటా వెంకటకృష్ణా రెడ్డి, రాగిపిండి బాలఅంకిరెడ్డి, పుట్లూరి అంబిరెడ్డి, సత్యంరెడ్డి, వెలుతుర్ల తిరుపతిరెడ్డి, బోడె వెంకటేశ్వరరెడ్డి, నాగేశ్వరరావు, పెయ్యల రమణయ్య పాల్గొన్నారు.

క్రీడలు ఐక్యతను పెంచుతాయి



విజేతలతో చైర్మన్ గఫార్, వైఎస్సార్ సీపీ నాయకులు

కనిగిరి రూరల్: క్రీడలు యువతలో ఐక్యతాభావాన్ని, స్నేహభావాన్ని పెంపొందిస్తాయని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల విజేతలకు శుక్రవారం రాత్రి బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి, రామనబోయిన శ్రీను అధ్యక్షతన జరిగింది. జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి, ఏపీ మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ పెరుగు మురళీకృష్ణ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వైఎం ప్రసాద్‌రెడ్డి, వైస్ చైర్మన్‌లు పులి శాంతి గోవర్ధన్, మాణిక్యరావు, రాష్ట్ర నాయకులు పిల్లి లక్ష్మీనారాయణరెడ్డి, బసిరెడ్డి పిచ్చిరెడ్డి, డాక్టర్ రసూల్, సొసైటీ అధ్యక్షుడు సంగు సుబ్బారెడ్డి, కౌన్సిలర్లు శ్రీరాం సతీష్, వేల్పుల వెంకటేశ్వర్లు, శ్రీహరిరెడ్డి, బాలకృష్ణారెడ్డి, ఈర్ల శ్రీను, నరసింహ, కేశవ, కంటు గురవయ్య, చిన్నిగారి కొండలు, అరుణోధర్, సాయి పాల్గొన్నారు.

ఐదు గ్రామాల్లో రీసర్వే

హనుమంతునిపాడు: మండలంలోని 27 రెవెన్యూ గ్రామాల్లో ఇప్పటి వరకు 18 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తయిందని తహసీల్దార్ ఎస్. హరిబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనందపురం అగ్రహారం రెవెన్యూలో రీసర్వే పూర్తి చేశామన్నారు. ప్రస్తుతం నల్లగండ్ల, ముప్పాళ్లపాడు, దాసళ్లపల్లి, మాసాయిపేట, నీలకంఠాపురం గ్రామాల్లో రీసర్వే జరుగుతోందన్నారు.

ఔషధ మొక్కలు నాటి సంరక్షించాలి

పీసీపల్లి: ఔషధ మొక్కలు నాటి సంరక్షించడంతో పాటు పెరటి మొక్కలు సాగు చేసుకోవాలని బయోడైవర్సిటీ మండల కో ఆర్డినేటర్ షేక్ నాయబ్‌రసూల్ అన్నారు. మండల కేంద్రం పీసీపల్లె సచివాలయంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ బయో డైవర్సిటీ ఆధ్వర్యంలో ఔషధ మొక్కలు వాటి ఆవశ్యకత, పెరటి మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల కో ఆర్డినేటర్ నాయబ్‌రసూల్ ఔషధ, పెరటి మొక్కల విత్తనాలు పంపిణీ చేశారు. ఇంటింటికీ ఔషధ, పెరటి మొక్కల విత్తనాలు తోటకూర, ధనియాలు, తులసి, అశ్వగంధి, గోంగూర, మునగవంటి విత్తనాలు అందిస్తున్నట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షిస్తే భావితరాల వారు ఆరోగ్యంగా జీవించగలరన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్ వాణిప్రియారెడ్డి, మహిళా పోలీస్ ధనలక్ష్మి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ కాశీ శివ, గోదా వెంకటేశ్వర్లు పలువురు మహిళలు పాల్గొన్నారు.

కంప్యూటర్ నంబర్ విధానంతో భద్రత

పొన్నలూరు: కంప్యూటర్ నంబర్ విధానంతో ప్రయాణికులతోపాటూ ఆటోలకు భద్రత ఏర్పడుతుందని కొండపి సీఐ మాతంగి శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం పొన్నలూరు పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని 67 మంది ఆటో డ్రైవర్లకు సీరియల్ నంబర్ స్టిక్కర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలో మహిళా పోలీసుల ద్వారా గుర్తించిన ఆటోలకు స్టిక్కర్లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై రాజారావు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.


విద్యుత్ బకాయిలు త్వరితగతిన చెల్లించాలి

పీసీపల్లి: మండలంలో విద్యుత్ బకాయిలు త్వరితగతిన చెల్లించాలని విద్యుత్‌శాఖ కనిగిరి ఏడీఏ ఉమాకాంత్ కోరారు. మండలంలో విద్యుత్ బిల్లులు బకాయిలు ఉన్న సర్వీసులను శుక్రవారం ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిల్లులు సకాలంలో చెల్లించకుంటే కనెక్షన్ తొలగిస్తామని హెచ్చరించారు. పాతబకాయిలు చెల్లించాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట మండల విద్యుత్‌శాఖాధికారులు వెంకట లక్ష్మీప్రసన్న, సిబ్బంది పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూల్‌కు కంప్యూటర్ బహూకరణ

గుడ్లూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు (1989–94) శుక్రవారం కంప్యూటర్, ప్రింటర్‌లు బహూకరించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పాలూరు మురళి, మానం శ్రీనివాసులు, వల్లెపు శ్రీనులు మాట్లాడుతూ తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలనే లక్ష్యంతో పాఠశాలకు రూ.60 వేల విలువైన కంప్యూటర్, ప్రింటర్ అందజేశామన్నారు. సైన్సు ఉపాధ్యాయుడు వల్లెపు మురళి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్ అందజేసిన పూర్వ విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తున్నామన్నారు.

గ్రామానికి మంచి పేరు తేవాలి



అలకూరపాడులో విద్యార్థులకు నగదు బహుమతులు అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

టంగుటూరు: విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులు, పాఠశాల, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఎస్‌ఆర్‌ఐ నార్నె రామారావు సూచించారు. మండలంలోని ఆలకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత ఏడాది 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మన ఊరు ట్రస్టు తరఫున నగదు బహుమతులు శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మహాలక్ష్మి మాట్లాడుతూ.. అమెరికాలో ఉద్యోగం చేస్తున్న గ్రామవాసి నార్నె శ్రీనివాసులు 2010 నుంచి విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నారు. 2021–22 టెన్త్ ఫలితాల్లో ప్రతిభ చాటిన మీసాల వినయ్‌కుమార్‌కు రూ.25 వేలు, ఏకా వెంకట గణేష్‌కు రూ.15 వేలు, యామని వీణా కుమారికి రూ.10 వేలను చిడిపోతు వెంకటేశ్వర్లు చేతుల మీదుగా అందించారు. ప్రథమ బహుమతి పొందిన మీసాల వినయ్‌కుమార్‌కు ఇంటర్ చదువుకునేందుకు రూ.50 వేలు ఇవ్వనున్నారని తెలిపారు. గణితంలో మంచి మార్కులు వచ్చేలా కృషి చేసిన ఉపాధ్యాయుడు సత్యసుధాకర్‌కు ఎస్‌ఎంసీ మాజీ చైర్మన్ ఏకా నరసింహం రూ. 5116 అందజేశారు. కాగా తృతీయ బహుమతి రూ.10 వేలు, ఉపాధ్యాయుడు సత్యసుధాకర్‌కి ఇచ్చిన రూ.5,116ను పాఠశాల అభివృద్ధికి ఉపయోగించాలని హెచ్‌ఎంకు అందజేశారు. కార్యక్రమంలో ఆలం రామారావు ఎస్‌ఎంసీ చైర్మన్ చీకటి విక్రమ్, సర్పంచి బిల్లా రూసీ, బడుగు వేణు, మన్నం ప్రసాద్, ఎస్‌ఆర్‌ఐ తొట్టెంపూడి వెంకట్రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి–సంక్షేమం రెండు కళ్లు



మహిళకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

● ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: అభివృద్ధి–సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. స్థానిక ఏడో సచివాలయంలోని అర్బన్ కాలనీలో శుక్రవారం రాత్రి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ కరోనా కష్ట కాలంలో సైతం ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. నవరత్నాల పథకాల ద్వారా ప్రతి ఇంట్లో సంక్షేమ కాంతులు విరజిల్లుతున్నాయన్నారు. అర్హతే ప్రమాణికంగా పార్టీల కతీతంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందచేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వందేనన్నారు. స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. తక్షణ సమస్యల పరిష్కారానికి కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఎమ్మెల్యే బుర్రా ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్‌లు అందచేశారు. తొలుత స్థానిక నాయకులు ఎమ్మెల్యే బుర్రాకు స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, వైస్ చైర్మన్‌లు పులిశాంతి గోవర్ధన్, మాణిక్యరావు, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు రంగనాయకులరెడ్డి, సంగు సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి, పార్టీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు టి.సుజాత, ఏపీ మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ పెరుగు మరళీకృష్ణ, మాజీ ఎంపీటీసీ జిలానీ, కౌన్సిలర్లు రామనబోయిన శ్రీను, దాసరి మురళి, నక్కా రామకృష్ణ, ఫయాజ్, శ్రీరామ్ సతీష్, చింతం శ్రీను, శ్రీహరిరెడ్డి, షఫీ, మీరావలి, సంధాని, కంటు గురవయ్య, వెంకటయ్య, మన్సూర్, నాగూర్‌బీ, భారతి పాల్గొన్నారు.

జన్మభూమి కమిటీల అరాచకాలు కనిపించలేదా?

● రామోజీ, పచ్చ మీడియా తీరుపై అశోక్‌బాబు ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వరికూటి అశోక్‌బాబు, పక్కన పార్టీ నాయకులు

మద్దిపాడు: గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పేరుతో అర్హులకు అన్యాయం చేసిన విషయం, వారి అరాచకాలు రామోజీరావు, పచ్చ మీడియా కళ్లకు కనిపించలేదా అని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్ బాబు ప్రశ్నించారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధుల్లా పనిచేస్తున్న గ్రామ వలంటీర్ల సేవకు రూ.ఐదు వేలు ఇస్తుంటే అంత అక్కసా అని ఎల్లో మీడియా, ఈనాడు దినపత్రికల యజమానులపై ధ్వజమెత్తారు. ఇటీవల గ్రామ వలంటీర్లపై ఎల్లో మీడియాలో వచ్చిన కథనాలను వరికూటి ఖండించారు. మండలంలోని అయ్యపరాజుపాలెం గ్రామంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. జన్మభూమి కమిటీలను పెట్టి అర్హులకు అన్యాయం చేసినప్పుడు పచ్చ పత్రికలు ఏం చేశాయని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో పింఛను తీసుకోవాలంటే గంటలకొద్ది కార్యాలయాల వద్ద అవ్వాతాతలు పడిగాపులు కాయాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు గ్రామ వలంటీర్లు ఒకటో తేదీ తెల్లవారుజామునే పింఛను అందిస్తుంటే లబ్ధిదారుల మొహంలో కనిపిస్తున్న ఆనందాన్ని రాయండని పచ్చ మీడియాకు హితవు పలికారు. ప్రజలకు అందుతున్న పథకాలు ఏమిటో రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన ఎమ్మెల్యే డోలాకు కనీసమాత్రమైనా తెలుసా అని నిలదీశారు. త్వరలో నీకు, మీ నాయకునికి రాష్ట్ర ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. పిచ్చి రాతలు రాస్తే తగినమూల్యం చెల్లించుకోకతప్పదని ఎల్లో మీడియాపై వరికూటి విరుచుకుపడ్డారు. ఆయన వెంట మద్దిపాడు, పొన్నలూరు ఎంపీపీలు వాకా వెంకటరెడ్డి, కే మాదవరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు దొద్దాలి మల్లికార్జున, గంగవరపు ప్రసాదు, ఇనుకొల్లు మాదిరెడ్డి, బుర్రి అంజయ్య, బి.రామాంజనేయులు, జి.మాదవరావు, జి.చెన్నంరాజు, జి.వెంకటేష్‌రాజు, ఎం.రామిరెడ్డి, వాకా బాలకృష్ణారెడ్డి, అలికేపల్లి వెంకటరెడ్డి ఉన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు

● వరికూటి అశోక్‌బాబు



ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న వరికూటి అశోక్‌బాబు

మద్దిపాడు: పేదల జీవితాలల్లో వెలుగులు నింపాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా సమూల మార్పులకు శ్రీకారం చుట్టారని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని తంగెళ్ల సచివాలయ పరిధిలోని అయ్యపరాజుపాలెం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ.. సాంకేతికపరమైన కారణాలతో అర్హులైన వారు సంక్షేమానికి దూరం కాకుండా చూడాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ పథకాలు ప్రజల చెంతకు చేరువ చేయడానికి సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ఉందనే విశ్వాసాన్ని ప్రజల్లో నిరంతరం పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడం వైఎస్సార్ సీపీతోనే సాధ్యమన్నారు. అర్హత ఉండీ పథకాలు రాని కుటుంబాలు ఉంటే వాటిపై ఆరాతీసి అక్కడికక్కడే పరిష్కరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని రానున్న ఎన్నికల్లో మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, పొన్నలూరు ఎంపీపీ కె.మాదవరావు, దొద్దాలి మల్లికార్జున, గంగవరపు ప్రసాదు, బుర్రి అంజయ్య, బుర్రి రాంమాంజనేయులు, గుట్లపల్లి మాదవరావు, గొబ్బూరి చెన్నంరాజు, జి.వెంకటేష్ రాజు, ఎం.రామిరెడ్డి, వాకా బాలకృష్ణారెడ్డి, అలికేపల్లి వెంకటరెడ్డి పలు పంచాయతీల సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

100 మందికి ఆధార్ నమోదు

జరుగుమల్లి(సింగరాయకొండ): ప్రభుత్వ పథకాలు పొందాలంటే ప్రతి ఒక్కరూ ఆధార్ నమోదు చేసుకోవాలని గ్రామ/వార్డు సచివాలయాల పర్యవేక్షణాధికారి ఉషారాణి పేర్కొన్నారు. జరుగుమల్లి మండలం చింతలపాలెం గ్రామ సచివాలయంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత రెండు రోజుల్లో 100 మందికి ఆధార్ నమోదు చేసినట్లు తెలిపారు. ఈ నెల 21, 23 తేదీల్లో తూమాడు, చిర్రికూరపాడు గ్రామ సచివాలయాల వద్ద ఆధార్ మొబైల్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతే ధ్యేయం

ఉలవపాడు: ఆర్థిక అక్షరాస్యతే ధ్యేయంగా ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు పనిచేస్తోందని బ్యాంకు మేనేజర్ ఫణీంద్ర అన్నారు. శుక్రవారం స్థానిక వరిగచేను సంఘంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతా కలిగి ఉండాలన్నారు. తమ వద్ద సులభతరంగా ఖాతా అందిస్తున్నట్లు తెలిపారు. అన్ని బ్యాంకులకన్నా అత్యధికంగా డిపాజిట్లపై 7.80 శాతం వడ్డీరేటు అందిస్తున్నట్లు తెలిపారు. పొదుపు సంఘాలకు రూ.20 లక్షల వరకు రుణాలు అందిస్తున్నామని పేర్కొన్నారు.